




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు



సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.

శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో

సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



| శుక్రవారం 22 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 354 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|




## పర్యాటక రంగానికి 'డిజిటల్' బూస్టర్

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 22, ప్రతినిధి: తెలంగాణ పర్యాటక రంగాన్ని డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. బేగంపేట టూరిజం ప్లాజాలో నిర్వహించిన 'తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశం'లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పర్యాటకం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, యువతకు ఉపాధికి, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌కు శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రకృతి అందాలు, చారిత్రక వైభవం, సంస్కృతి సంపదను సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి చాటాలని ఇన్ఫ్లుయెన్సర్లను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల కార్యాచరణను వేగవంతం చేసి పర్యాటక రంగానికి కొత్త ఊపు తీసుకురావడానికి చర్యలు చేపట్టిందన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని, పర్యాటక ఆదాయాన్ని వైద్య, ఆరోగ్య, విద్య రంగాల బలోపేతానికి వినియోగిస్తామని తెలిపారు. తెలంగాణ ప్రజలు కూడా తమ రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను విస్తృతంగా సందర్శించాలని సూచిస్తూ కుటుంబంతో కలిసి పర్యాటక ప్రాంతాల్లో గడపడం మానసిక ప్రశాంతతను ఇస్తుందని చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత, కనీస వసతులు, ఆధునిక టెంట్ సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని, వినియోగంలో లేని హరిత మోటళ్లు, పర్యాటక భూములను ఆదాయ వనరులుగా మార్చే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు కేవలం పర్యాటక ప్రమోషన్‌కే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని సూచించిన మంత్రి, యువత డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండేలా చైతన్యం కల్పించాలని కోరారు. త్వరలో 'ప్రభాత భేరి' పేరుతో సామాజిక చైతన్య కార్యక్రమాన్ని ప్రారంభించి లఘు చిత్రాలు, నాటికలు, కళారూపాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ సంస్కృతి, వారసత్వం, హస్తకళలు, చేనేత వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో టూరిజం క్రియేటర్లు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన మంత్రి, ఉత్తమ ప్రతిభ కనబరిచే టూరిజం క్రియేటర్లకు ప్రభుత్వం తరఫున అవార్డులు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ నూతన మెటా ఖాతా, అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌ను ఆవిష్కరించగా 'టైమ్‌లెస్ తెలంగాణ' వీడియోను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, ఎండీ గౌతమి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా క్రీడా దినోత్సవం



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 22, ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న "స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు" కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా "క్రీడా దినోత్సవం"ను ఘనంగా నిర్వహించారు. తెలంగాణలోని 32 జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్లు, అధికార యంత్రాంగం పర్యవేక్షణలో యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్ర స్థాయి ప్రధాన ఉత్సవాలు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా యువత, క్రీడాకారులు, తల్లిదండ్రులు, ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి జీఎంసీబీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, జింఖానా గ్రౌండ్స్, సైక్లింగ్ వెలోడ్రోమ్ తదితర క్రీడా వేదికల్లో ఇంటర్ స్టేడియా పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫెన్సింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, ఫుట్‌బాల్, చెస్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, రెజ్లింగ్ వంటి క్రీడాంశాల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి పోటీలను స్వయంగా పర్యవేక్షించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోందని, సమాజంలోని అన్ని వర్గాల వారు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొనే అవకాశాలు కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు రవితేజ, సుజాత, శ్రీనివాస్, స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు రవికుమార్, రాజ్‌వీర్, నందకిషోర్, కన్నం మధు, పీఆర్‌వో కాలేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 21 మందికి ఆర్థిక సహాయం



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 22, ప్రతినిధి: జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 21 మందికి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన అధ్యక్షతన జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ 5వ సమావేశం నిర్వహించారు. ఆర్థిక సహాయం కోసం వచ్చిన 29 దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించి, మరణించిన 17 మంది జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర ప్రమాదాలకు గురైన మరియు దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న నలుగురు జర్నలిస్టులకు ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఎంపికైన మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించడంతో పాటు, ప్రతి నెల రూ.3 వేల పెన్షన్‌ను ఐదు సంవత్సరాల పాటు అందజేస్తామని తెలిపారు. అలాగే ఆ కుటుంబాల్లో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు చదువుతున్న ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు రూ.1,000 చొప్పున ట్యూషన్ ఫీజు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న నలుగురు వర్కింగ్ జర్నలిస్టులకు కూడా సంక్షేమ నిధి నుంచి ప్రత్యేక ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణచందర్ రావు, మేనేజర్ డి.ఆర్.ఎస్. శైలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంజేపీ గురుకులాలకు బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 22, ప్రతినిధి: మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాసంస్థలను రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు సమిష్టిగా కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాళ్లను అభినందించిన మంత్రి, ఫలితాలు తక్కువగా వచ్చిన విద్యాసంస్థలు ఆత్మపరిశీలన చేసుకుని వచ్చే విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించాలని హెచ్చరించారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ వంటి ఆధునిక అంశాల్లోనూ ప్రోత్సాహం అందించాలని సూచించారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తూ గురుకులాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని, మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలని, వారిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చిన్న చిన్న కారణాలతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, వారిలో మానసిక ధైర్యం పెంచేలా మోటివేషన్ కల్పించాలని కోరారు. పదో తరగతిలో 98.45 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల సెక్రటరీ సైదులు, ప్రిన్సిపాళ్లను అభినందించిన మంత్రి, 204 ఎంజేపీ గురుకులాలు 100 శాతం ఫలితాలు సాధించగా 65 పాఠశాలలు వెనుకబడ్డాయని పేర్కొన్నారు. తెలుగు సబ్జెక్టులో ఎక్కువ మంది ఫెయిల్ అవుతున్నారని, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ర్యాంకర్ల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి గ్రామాల్లో ఫలితాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 90.31 శాతం, వొకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 97.72 శాతం, ప్రథమ సంవత్సరంలో 85.80 శాతం, వొకేషనల్ ప్రథమ సంవత్సరంలో 95.81 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. 900 పైగా మార్కులు 4183 మంది, 980 పైగా మార్కులు 496 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ప్రతి గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని, ఎనిమిదో తరగతి నుంచే నీట్, ఎంసెట్, ఇతర పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌ను తప్పనిసరి చేసి ఎంజేపీ గురుకులాలకు ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని పేర్కొన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల సొసైటీ సెక్రటరీ సైదులు, ఆర్సీవోలు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



## ఆసిఫాబాద్ గడ్డపై 'ఇందిరమ్మ పండుగ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 22, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ప్రతిష్టాత్మక 'ఇందిరమ్మ ఇండ్ల' రెండో విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార–పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె. హరిత, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తదితరులతో కలిసి సభాస్థలి, రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్, దాదానగర్, సిర్పూర్ పేపర్ మిల్ క్రీడా ప్రాంగణాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా 1.20 లక్షల ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, జూన్ నాటికి 2.35 లక్షల ఇండ్లు పూర్తవుతాయని వెల్లడించారు. గత ప్రభుత్వంలో గృహనిర్మాణం ఆర్భాటాలకు మాత్రమే పరిమితమైందని, కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రూ.22,700 కోట్లతో 4 లక్షల ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇంటి నిర్మాణ పురోగతికి అనుగుణంగా దశలవారీగా రూ.5 లక్షలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. మొదటి, రెండో విడతలకే పరిమితం కాకుండా అర్హత కలిగిన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే వరకు ప్రభుత్వం కృషి కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని కొఠారి గ్రామంలో గిరిజన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం ద్వారా ఆదివాసీల సొంతింటి కలలను సాకారం చేస్తున్నామని చెప్పారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి, రేషన్ కార్డులు, ఇందిరా మహిళా శక్తి, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో 2026-28 సంవత్సరాలకు గాను అర్హులైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు కేంద్ర సహకారం కోరిన భట్టి



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 22, ప్రతినిధి: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో న్యూఢిల్లీలో సమావేశమై సింగరేణి కాలరీస్ కంపెనీ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్–II మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని వివరించారు. కోల్ ఇండియా తరహాలో సింగరేణి కూడా ఆధునిక సాంకేతికతతో బొగ్గు వనరులను సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందని తెలిపారు. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వ సాంకేతిక, విధానపరమైన సహకారం అందించాలని కోరారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్–III తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమని, గతంలో వేలంలో కేటాయించినప్పటికీ నాలుగేళ్లుగా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొయ్యగూడెం బ్లాక్–IIIను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. తాడిచెర్ల కోల్ బ్లాక్–IIకు సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీ-మైనింగ్, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. MMDR చట్టం 1957 సెక్షన్–5 కింద ముందస్తు అనుమతి మంజూరు చేసి మైనింగ్ లీజ్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ సింగరేణి గ్యాసిఫికేషన్ ప్రణాళికలు, కొయ్యగూడెం బ్లాక్–III కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్–II మైనింగ్ లీజ్ అంశాలపై సంబంధిత కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో త్వరలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్, సింగరేణి సీఎండీ డా. జ్యోతి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ గౌతమ్ పొట్రు, డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## సూర్యాపేట జిల్లాలో మండుతున్న ఎండలు.. 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 22, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీజీడీపీఎస్) విడుదల చేసిన ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల నివేదిక ప్రకారం సూర్యాపేట జిల్లాలో పలుచోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. మేళ్లచెర్వు మండలంలో అత్యధికంగా 46.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా, గరిడేపల్లి, మోతే మండలాల్లో 46.1 డిగ్రీలు నమోదయ్యాయి. మద్దిరాల, మునగాల, చిలుకూరు, నూతంకల్, పెన్‌పహాడ్, తిరుమలగిరి, నడిగూడెం తదితర ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోదాడ సమీపంలోని తొగర్రాయిలో 45 డిగ్రీలు నమోదైంది. వర్షపాతం ఎక్కడా నమోదు కాలేదని అధికారులు తెలిపారు. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటడంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని, తగినంత నీరు తాగుతూ జాగ్రత్తలు పాటించాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.



## నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 22, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి వచ్చే నాలుగు రోజుల్లో పూర్తి స్థాయిలో కొనుగోళ్లు పూర్తిచేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. గురువారం మద్దిరాల, నూతనకల్ మండలాల్లోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి రూ.437 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసేందుకు ప్రతిరోజు ట్యాబ్ ఎంట్రీలు, ట్రక్ షీట్లను నిరంతరం పరిశీలిస్తూ మానిటరింగ్ చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో రోజుకు 9 వేల నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలిస్తున్నామని చెప్పారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇన్‌ఛార్జ్ అధికారిని నియమించడంతో పాటు మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఒక సీనియర్ అధికారి, ఒక పోలీస్ అధికారిని ప్రత్యేకంగా నియమించి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ట్రాన్స్‌పోర్ట్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని వెల్లడించారు. వచ్చే నాలుగు రోజులు ధాన్యం కొనుగోళ్లకే అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలోని పూర్తి స్థాయి ధాన్యాన్ని సేకరిస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీఓ సన్యాసయ్య, అడిషనల్ పీడ్ చంద్రశేఖర్, మద్దిరాల ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, నూతనకల్ ఎంపీడీవో సునీత తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 22, ప్రతినిధి: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి, ఆదాయ భద్రత కల్పించబడుతోందని, గ్రామీణ కూలీలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. గురువారం ఆత్మకూరు మండలంలోని నెమ్మికల్ గ్రామం, మద్దిరాల మండలంలోని నూతనకల్, పోలుమల్ల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సాంకేతిక, నాణ్యత ప్రమాణాల ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తీవ్ర ఎండల నేపథ్యంలో పనిస్థలాల్లో కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, ఎండ నుంచి ఉపశమనం కోసం ఏర్పాటు చేసిన షెడ్లు, తాగునీరు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ఓఆర్ఎస్ ప్యాకెట్లను తనిఖీ చేశారు. వడదెబ్బ తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయాన్నే పనులు ముగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కూలీలతో ముచ్చటించిన కలెక్టర్ వేతనాలు సమయానికి జమవుతున్నాయా, ప్రభుత్వం నిర్ణయించిన సగటు వేతనం అందుతుందా, పనుల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కూలీలు తెలిపిన సమస్యలను విని తక్షణ పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో వడదెబ్బ బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ సన్యాసయ్య, అడిషనల్ పీడీ చంద్రశేఖర్, ఆత్మకూరు ఎంపీడీవో హసిమ్, నూతనకల్ ఎంపీడీవో సునీత, మద్దిరాల ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏపీడీ పవన్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు వైద్యులపై వేధింపులు ఆపాలి: ఐఎంఏ వినతి



సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 22, ప్రతినిధి: ప్రైవేటు వైద్య సేవలను అందిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బందిపై జరుగుతున్న వేధింపులు, బెదిరింపులు, అసత్య ఆరోపణలు, ఫిర్యాదు వ్యవస్థ దుర్వినియోగంపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సభ్యులు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. పెండెం వెంకట రమణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎంఏ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రైవేటు వైద్యులు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ కొంతమంది వ్యక్తులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిరాధార ఫిర్యాదులు చేయడం, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడం, వైద్య సిబ్బందిని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు వైద్యుల మనోధైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా ఆరోగ్య సేవల అందింపుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఫిర్యాదు వ్యవస్థను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని, కావాలని తప్పుడు ఆరోపణలు చేసే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. పెండెం వెంకట రమణ మాట్లాడుతూ గౌరవ కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ నేతృత్వంలో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ పరిధిలో పనిచేస్తున్న వైద్యులు చట్టపరమైన నియమ నిబంధనలకు అనుగుణంగా సేవలు అందించాలని సూచించారు. సూర్యాపేట జిల్లాలోని వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఐఎంఏ అధ్యక్షుడు డా. ఆనంద్ దాండ్గే, ప్రధాన కార్యదర్శి డా. ఎల్. రమేశ్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ డా. వి. రామ్మూర్తి, డా. మీల సందీప్, డా. విజయలక్ష్మి, డా. అనూష అనంతుల, డా. కందుల శ్రీరామ్ కుమార్, డా. పటేల్ యశ్వంత్ రెడ్డి, డా. సుప్రజ, డా. శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ డెమో వి. సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 22, ప్రతినిధి: 2026-27 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కె. దయానందరాణి తెలిపారు. మార్చి-2026లో పదో తరగతి ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, పిహెచ్‌సీ విద్యార్థులు [తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్](https://telanganaepass.cgg.gov.in?utm_source=chatgpt.com) ద్వారా సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతిలో జీపీఏ 7.0 లేదా 400కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు మాత్రమే ఈ అవకాశానికి అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ షెడ్యూల్డ్ కులముల వసతి గృహాల్లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు, ఎయిడెడ్, మున్సిపల్, జిల్లా పరిషత్, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, జవహర్ నవోదయ విద్యాలయాలు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత ప్రవేశం కల్పించబడుతుందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు ప్రక్రియ మే 20 నుంచి జూన్ 5 వరకు కొనసాగుతుందని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన, కళాశాలల అలాట్‌మెంట్ ఆర్డర్ల పంపిణీ జూన్ 12న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ సూచించింది.

## నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా డిజిటల్ అవగాహన ప్రచారం

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 22, ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లాలో మాదకద్రవ్యాల వ్యతిరేక డిజిటల్ అవగాహన ప్రచారాన్ని జిల్లా యంత్రాంగం వేగవంతం చేసింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యువత, విద్యార్థులు సహా జిల్లాలోని పౌరులందరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఆన్‌లైన్ ద్వారా ఇ-ప్రతిజ్ఞ చేయేందుకు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించినట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడటం వారి భవిష్యత్తుకు, ప్రజారోగ్యానికి పెద్ద ముప్పుగా మారుతోందని పేర్కొంటూ ప్రజలందరినీ భాగస్వాములను చేయడానికి భారత సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఈ డిజిటల్ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. నిర్ణీత క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లేదా అధికారిక పోర్టల్ [నషా ముక్త భారత్ అభియాన్ ఇ-ప్రతిజ్ఞ](https://nmba.dosje.gov.in/pledge?type=e-pledge&utm_source=chatgpt.com) ను సందర్శించడం ద్వారా ప్రజలు తమను, తమ కుటుంబాలను, సమాజాన్ని మత్తు పదార్థాలకు దూరంగా ఉంచుతామని డిజిటల్ ప్రతిజ్ఞ చేయవచ్చని తెలిపారు. ప్రతిజ్ఞ పూర్తి చేసిన వెంటనే కేంద్ర ప్రభుత్వ అధికారిక ప్రశంసా పత్రాన్ని కూడా ఆన్‌లైన్‌లో పొందవచ్చని వెల్లడించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇ-ప్రతిజ్ఞ క్యూ ఆర్ కోడ్ అందుబాటులో ఉండేలా చూడాలని విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజలందరూ ఈ ప్రచారంలో చురుగ్గా పాల్గొని సూర్యాపేట జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా సంక్షేమ శాఖ పిలుపునిచ్చింది.

## భారత జనగణన ప్రచార రథానికి కలెక్టర్ శ్రీకారం




సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 22, ప్రతినిధి: భారత జనగణన కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రజల వివరాలు సక్రమంగా నమోదు కావడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు ఉపయోగపడుతాయని తెలిపారు. భారత జనగణన ప్రచార రథం సూర్యాపేట జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తూ ప్రజలకు జనగణన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్రతి కుటుంబం తమ వివరాలను సిబ్బందికి నిజాయితీగా, పూర్తి స్థాయిలో అందించాలని సూచించారు. జనగణన కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని, జనగణన సిబ్బంది ఇంటింటికి వచ్చినప్పుడు పూర్తి వివరాలు అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జనాభా, కుటుంబ సభ్యుల వివరాలు వంటి సమాచారం ప్రభుత్వ ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఓ కిషన్, దున్న శ్యాం, మధు, ఫీల్డ్ ట్రైనర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటలో నేడు 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి కార్యక్రమం

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 22, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. స్థానిక రవిమహల్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్త పథకాలపై సమగ్ర విశ్లేషణతో పాటు వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో సాధించిన విజయాలు, రాబోయే కార్యక్రమాలపై వివరాలు వెల్లడించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రెవెన్యూ, విద్యా, విద్యుత్, పౌరసరఫరాల శాఖలకు చెందిన అధికారులు సమీక్షా సమావేశంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



## రీల్స్‌తో మెదక్ పర్యాటక అందాలను ప్రపంచానికి చాటాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, మే 22, ప్రతినిధి: ఇన్‌ఫ్లుయెన్సర్లు రీల్స్ ద్వారా మెదక్ జిల్లా పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేసి, లోకల్ టు గ్లోబల్‌గా మెదక్ ఘన కీర్తిని ప్రపంచానికి పరిచయం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. మెదక్ జిల్లా టూరిజాన్ని ప్రపంచానికి పరిచయం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీలపై ఇన్‌ఫ్లుయెన్సర్లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్లతో ముఖాముఖి చర్చించి పోటీ విధివిధానాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, బహుమతుల వివరాలను వివరించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాల్లో భాగంగా తొలిసారిగా వినూత్న పద్ధతిలో ఈ రీల్స్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాలపై 4కే వీడియో క్వాలిటీతో రీల్స్ రూపొందించి మే 30 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి సమర్పించవచ్చని, లేదా డీపీఆర్ఓ రాజు 9949922291, ఏపీఆర్ఓ బాబు 9701306838 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించవచ్చని పేర్కొన్నారు. పోటీల్లో విజేతలకు జూన్ 2న నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లాలో ఆధ్యాత్మిక దేవాలయాలు, ప్రకృతి పర్యాటక కేంద్రాలు, జలపాతాలు, అభయారణ్యాలు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో నిండిన అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, జూన్ నుంచి పర్యాటకుల రాక పెరిగే అవకాశముందని చెప్పారు. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పూర్తి వివరాలతో రీల్స్ రూపొందించాలని సూచించారు. అనంతరం పర్యాటక దినోత్సవ టూరిస్ట్ గైడ్ పోస్టర్‌ను ఆవిష్కరించి, టూరిస్ట్ గైడ్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీపీఆర్ఓ రామచంద్ర రాజు, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, యూట్యూబర్లు తదితరులు పాల్గొన్నారు.



## సాహిత్యంతోనే సమాజంలో మార్పు సాధ్యం: అదనపు కలెక్టర్ నగేష్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, మే 22: సాహిత్యం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యం సమాజ అభ్యున్నతికి శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. కవి సమ్మేళనాల ద్వారా సాహిత్యం కేవలం వినోదానికి మాత్రమే కాకుండా సమాజంలో చైతన్యం కలిగించే శక్తిగా మారుతుందన్నారు. యువ కవులకు ప్రోత్సాహం అందించడం, తెలుగు భాషా సాహిత్య వైభవాన్ని కొత్త తరానికి పరిచయం చేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు, రచయితలు తమ కవితల ద్వారా సామాజిక సమస్యలు, మానవ విలువలు, యువత బాధ్యత, మహిళా సాధికారత, ప్రకృతి పరిరక్షణ అంశాలపై చైతన్యం కలిగించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, డీవైఎస్ఓ రమేష్, జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## తాడిచెట్టు నుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు – ఆసుపత్రిలో పరామర్శ



గౌడ సంఘం నాయకుల పరామర్శ – మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరిన నేతలు

సందేశం టైమ్స్, మే 22: ముష్టికుంట్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు దారగాని ఆంజనేయులు గురువారం ఉదయం తాడిచెట్టు పైకి ఎక్కి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని ఖమ్మంలోని యలమద్ది ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న గౌడ సంఘం నాయకులు ఆసుపత్రిని సందర్శించి బాధితుడిని పరామర్శించారు. గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు దారగాని నాగేశ్వరరావు, కంతమామహేశ్వరుని ఆలయ చైర్మన్, గీత పనివార్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంధం నాగేశ్వరరావు, నాయకులు దారగాని కృష్ణమూర్తి, బంధం అనిల్ కుమార్ గౌడ్, బంధం అద్దంకి నాగేశ్వరరావు గౌడ్ తదితరులు ఆంజనేయుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



## మెదక్ కోట అభివృద్ధికి పటిష్ట చర్యలు

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, మే 22: మెదక్ కోట పునరుద్ధరణ, పరిరక్షణ మరియు పర్యాటక అభివృద్ధి కోసం పురావస్తు శాఖ సమన్వయంతో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో పురావస్తు శాఖ డైరెక్టర్, సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మెదక్ కోట అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. కాకతీయులు నిర్మించి, అనంతరం కుతుబ్‌షాహీ పాలకులు మరింత పటిష్టం చేసిన ఈ చారిత్రక కోట తెలంగాణ వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. కోట అభివృద్ధి కోసం గతంలో ప్రతిపాదించిన రూ.6.20 కోట్ల అంచనాను ప్రస్తుతం సుమారు రూ.10 కోట్లకు సవరించినట్లు తెలిపారు. కోట సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పరిరక్షణ పనులు, ఆదాయ వనరుల అభివృద్ధి, భూదృశ్య సుందరీకరణ అనే మూడు విభాగాలుగా అభివృద్ధి కార్యక్రమాలను విభజించి అమలు చేయనున్నట్లు చెప్పారు. సందర్శకుల కోసం మార్గాలు, లైటింగ్, తాగునీరు, కూర్చునే సౌకర్యాలు, సూచిక బోర్డులు, పారిశుధ్య వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. టూరిస్ట్ గైడ్‌లు, టూరిస్ట్ పోలీసులను నియమించి భద్రత, పర్యాటక ప్రోత్సాహాన్ని బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. మెదక్‌ను ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పురావస్తు శాఖ, పర్యాటక శాఖ సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాలని పురావస్తు శాస్త్రవేత్త అర్జున్‌రావు సూచించారు. కోట అభివృద్ధి, పరిరక్షణకు అవసరమైన సవివర అంచనాలను త్వరగా సమర్పించాలని కలెక్టర్ పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. మెదక్ కోటను ప్రముఖ వారసత్వ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల సమీకరణకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రొఫెసర్ అర్జున్‌రావు, డాక్టర్ నాగరాజు, డిప్యూటీ డైరెక్టర్ నరసింగ్, డిప్యూటీ డైరెక్టర్ (ఇంజనీరింగ్) తదితరులు పాల్గొన్నారు.

## మధిరలో సభ్యత్వ నమోదు బాధ్యతలు నామ నాగేశ్వరరావుకు అప్పగింపు



సందేశం టైమ్స్, మే 22: బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ ప్రక్రియలో భాగంగా 119 నియోజకవర్గాలకు ఇంచార్జీలను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఈ క్రమంలో మధిర నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌గా మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావును నియమించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ నియామకం చేపట్టినట్లు సమాచారం.

## రైతు ఆత్మహత్య వార్తలు అవాస్తవం: కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, మే 22: జిల్లాలో ధాన్యం కొనుగోలు కారణంగా రైతు ఆత్మహత్య చేసుకున్నాడనే వార్తలు పూర్తిగా అవాస్తవమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, ఇటీవల కొన్ని పత్రికల్లో ప్రచురితమైన కథనాలపై వాస్తవ పరిస్థితులను పరిశీలించగా కుటుంబ కలహాల కారణంగానే ఆ రైతు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్లే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోందని, ఇప్పటివరకు సుమారు 2 లక్షల 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 28,521 మంది రైతుల ఖాతాల్లో రూ.311 కోట్లను నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సీరియల్ విధానంలోనే ధాన్యం సేకరణ జరుగుతోందని, రవాణా, మిల్లులకు కేటాయింపు, అన్‌లోడింగ్ ప్రక్రియలను సమన్వయం చేస్తూ నిర్వహిస్తున్నామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఒకేసారి అధికంగా ధాన్యం రావడంతో తాత్కాలిక ఆలస్యం జరిగినప్పటికీ వాటిని వెంటనే పరిష్కరించే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సంబంధిత సివిల్ సప్లైస్ అధికారులు, తహసీల్దార్లు మరియు ఇతర శాఖల అధికారులు కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారని, రైతులకు చెల్లింపులు కూడా నిరంతరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి మిల్లులకు తరలించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కృషి కొనసాగిస్తాం: కాంగ్రెస్ నేతలు



సందేశం టైమ్స్, మే 22: చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి వేడుకలు నరసింహపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం మండల అధ్యక్షుడు కన్నెబోయిన గోపి యాదవ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆధునిక భారత నిర్మాణానికి ఆయన చూపిన దూరదృష్టి నేటికీ మార్గదర్శకమని తెలిపారు. ఆయన ఆశయాలను రాహుల్ గాంధీ మరియు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు నన్నక శ్రీనివాసరావు, మడుపల్లి భాస్కర్ గౌడ్, కొప్పుల గోవిందరావు, కంచుమర్తి రామకృష్ణ, తోటకూరి ప్రగతి తదితరులు పాల్గొన్నారు.



## జోగిపేటలో రాజీవ్ గాంధీ వర్ధంతి ఘన నివాళులు కాంగ్రెస్ నేతల స్మరణ కార్యక్రమం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 22: అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, చిట్టిబాబు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు మరియు పార్టీ నాయకులు పాల్గొని రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు. భారత ఆధునిక అభివృద్ధికి పునాది వేసిన నేతగా ఆయన చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటీసీ డాకూరి వెంకటేశం, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్లు జ్యోతి ప్రదీప్ గౌడ్, రామకృష్ణ, శశిరేఖ అనిల్, ఊర్మిళ దుర్గేష్, మేఘరాణి, సైలన్, కల్పన నాగరాజు, కోఆప్షన్ సభ్యులు జీషన్, పిట్ల భాగ్యలక్ష్మి, లక్ష్మన్, ప్రవీణ్ కుమార్, ముంతాజ్ భేగం, అక్బర్ తదితరులు పాల్గొని ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## టేక్మాల్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి నివాళులు – కాంగ్రెస్ నేతల స్మరణ కార్యక్రమం



సందేశం టైమ్స్, టేక్మాల్ మండల ప్రతినిధి, మే 22: టేక్మాల్ మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నాయకులు ఘనంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ యువతకు స్ఫూర్తిదాయక నాయకుడని, ఆధునిక సాంకేతిక రంగ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, సమాచార సాంకేతికత అభివృద్ధికి ఆయన వేసిన పునాది దేశ పురోగతికి దారితీసిందని తెలిపారు. టేక్మాల్ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్ మాట్లాడుతూ ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆశిలి విద్యాసాగర్, సొసైటీ డైరెక్టర్ ఆకులపల్లి పాపయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేశ్ గౌడ్, టేక్మాల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భక్తుల కిషోర్, నాయకులు సల్ల అనీల్, కాంతం, సాయి శేషు గౌడ్, సాయిబాబా, ధనుంజయ్ తదితరులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## ఇంద్రేశం మున్సిపాలిటీలో 10వ వార్డులో ప్రభుత్వ నిధులతో బోర్ వేయింపు – కాలనీ వాసులకు తాగునీటి సదుపాయం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 22: పటాన్చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీలో 10వ వార్డు కౌన్సిలర్ ఎన్.ఎం. శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిధులతో ఇంద్రప్రస్థాన్ మరియు ఆర్కే నగర్ కాలనీలలో బోర్ వేయించడం జరిగింది. సుమారు 1300 కుటుంబాలకు తాగునీటి సమస్యను పరిష్కరించే లక్ష్యంతో ఈ బోర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కాలనీ వాసుల ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా జరిగేలా పూర్తి స్థాయిలో కృషి చేస్తానని కౌన్సిలర్ శివకుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు స్వాగతిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఇది మంచి చర్యగా అభిప్రాయపడ్డారు.

## ఇంద్రేశం 14వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి – కౌన్సిలర్ రాచమల్ల శ్రీనివాస్ గౌడ్‌పై ప్రజల ప్రశంసలు



సంగారెడ్డి మే 22 (సందేశం టైమ్స్) టౌన్ రిపోర్టర్ వి సాయి: ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సంబంధిత పనులను మున్సిపల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది. వార్డు పరిధిలో పేరుకుపోయిన మురుగు నీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న 14వ వార్డు కౌన్సిలర్ రాచమల్ల శ్రీనివాస్ గౌడ్ గారు పనులను వేగవంతం చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఈ పనుల పూర్తి కావడంతో కాలనీ ప్రాంతాల్లో పరిశుభ్రత మెరుగుపడిందని స్థానిక ప్రజలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా స్పందించిన కౌన్సిలర్ రాచమల్ల శ్రీనివాస్ గౌడ్ గారిని వార్డు ప్రజలు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## నక్క వాగులో ముసలి కలకలం – అప్రమత్తమైన గ్రామస్తులు, అటవీ శాఖకు సమాచారం



పటాన్చెరు మే 22 (సందేశం టైమ్స్) టౌన్ రిపోర్టర్ వి సాయి: పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని పోచారం ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో నక్క వాగులో ముసలి కనిపించడంతో స్థానికంగా కలకలం రేగింది. వాగు తీరంలో ముసలి సంచరిస్తుండటాన్ని గమనించిన గేదెలు, మేకల కాపరులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన గ్రామస్తులు ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ముసలిని సురక్షితంగా పట్టుకుని ప్రజలకు, పశువులకు ఎటువంటి ప్రమాదం కలగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## గణేష్ గడ్డ దేవాలయానికి ప్రత్యేక ర్యాంపు ఏర్పాటు – భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు మే 22 (సందేశం టైమ్స్ బి డేవిడ్): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం గ్రామంలో ఉన్న గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక గణపతి దేవాలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ర్యాంపు, మెట్లు ఏర్పాటు చేయనున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం జాతీయ రహదారి విస్తరణ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, ఆలయ కమిటీ పాలకవర్గం, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి దేవాలయం సమీపంలో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ గడ్డ దేవాలయం రాష్ట్రంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందని, ప్రతిరోజు వేలాది మంది భక్తులు దర్శించుకుంటున్న నేపథ్యంలో రహదారి విస్తరణ కారణంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జాతీయ రహదారి నుండి నేరుగా దేవాలయ ప్రాంగణంలోకి ప్రవేశించేలా ప్రత్యేక ర్యాంపు, స్వాగత తోరణం నుండి ఆలయం వరకు మెట్ల నిర్మాణం, నూతన ఆర్చ్, అలాగే దేవాలయం చుట్టూ 50 అడుగుల సీసీ ఫ్లోరింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జాతీయ రహదారుల డీఈ రామకృష్ణను ఆదేశించారు. అవసరమైతే గుడి సమీపంలో అండర్ పాసేజ్ నిర్మాణంపై కూడా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయత్రి పాండు, కౌన్సిలర్లు రాజు, లత, మాజీ సర్పంచులు సుధీర్ రెడ్డి, వెంకన్న, ఆలయ కమిటీ చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి, ఆలయ ఈవో లావణ్య, సీనియర్ నాయకులు నర్సింహా రెడ్డి, శ్రీకాంత్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి – రాజకీయ పార్టీల సహకారం అవసరం: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి మే 22 (సందేశం టైమ్స్): జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీ ప్రభుత్వ యంత్రాంగం మరియు రాజకీయ పార్టీల ప్రధాన బాధ్యతగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పాల్గొని ఓటర్ల జాబితాను పరిశీలించడం, ప్రజలకు అవగాహన కల్పించడం చేయాలని సూచించారు. ప్రతి పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లను వెంటనే నియమించుకోవాలని ఆయన కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని, అధికారులు మరియు రాజకీయ ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఎన్నికల విభాగ అధికారులు, సంగారెడ్డి తహసిల్దార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హత్నూరలో ధాన్యం కొనుగోలు నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్ – ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ

సంగారెడ్డి మే 22 (సందేశం టైమ్స్): హత్నూర మండలంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం, సమన్వయ లోపాలు మరియు పర్యవేక్షణ వైఫల్యాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, హత్నూర ఎంపీడీవో బి. శంకర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజశేఖర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హత్నూర మండలంలో ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు సంతృప్తికరంగా లేవని గుర్తించామని, కొనుగోలు కేంద్రాల వద్ద పర్యవేక్షణ, మానిటరింగ్, సమన్వయం లోపించడం వల్ల రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కలెక్టర్ తెలిపారు. పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీల్డ్ స్థాయిలో సమర్థవంతమైన పర్యవేక్షణ లేకపోవడం, సంబంధిత శాఖల మధ్య సమన్వయం లోపించడం వల్ల కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేస్తూ, నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు మూడు రోజుల్లో వివరణ సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.